క్లుప్తంగా

శెట్టిపల్లిలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లిలో ఆదివారం తెల్లవారు జామున పోలీసులు, ప్రత్యేక బలగాలు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని పలు నివాసాల్లో సోదాలు చేశారు. అనంతరం సీఐ యుగంధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న స్వామి రాజేష్



అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న స్వామి రాజేష్

మడకశిర: నియోజకవర్గానికి చెందిన యువ డాక్టర్ స్వామి రాజేష్‌కు అరుదైన అవకాశం దక్కింది. వైద్య రంగానికి సంబంధించిన అంతర్జాతీయస్థాయి సదస్సులో పాల్గొని మాట్లాడే అవకాశం దక్కించుకున్న తొలి యువ డాక్టర్‌గా స్వామి రాజేష్ నిలిచారు. డాక్టర్ స్వామి రాజేష్ .. ఎమ్మెల్యే తిప్పేస్వామి తనయుడు. ఆయన భువనేశ్వర్‌లో ఐఎంఎస్ అండ్ సమ్ ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో వైద్యుడిగా పని చేస్తున్నారు. ఈనెల 18, 19వ తేదీల్లో సియోల్‌లో 'ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ లివర్ సర్జన్స్' అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయనకు పాల్గొని ప్రసంగించారు. రాజేష్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడంతో మడకశిరకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రైతు దాతృత్వం

- ఆలయానికి రూ.2.50 లక్షల విరాళం



రైతు వీరజన్నప్పను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని చిన్నపరెడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన రైతు వీరజన్నప్ప రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు రాము, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, అమర్, నాగేంద్ర, వెంకటేష్‌గౌడ్, రామాంజినేయులు దాతను సన్మానించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

రొళ్ల: మండల కేంద్రం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గిడ్డబొమ్మనహళ్లి చెందిన కార్పెంటర్ ఆది, రొళ్లకు చెందిన కూలీ గోవిందరాజు పని నిమిత్తం మడకశిర వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో రొళ్లకు వస్తున్నారు. అయితే హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడటంతో హిందూపురం తరలించారు. అయితే గోవిందరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలో ఉన్న కొట్నూరు సమీపంలో అధిక లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ ఆదివారం బోల్తా పడింది. పెనుకొండ వైపు నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే అందులో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పేకాట రాయుళ్ల అరెస్టు

లేపాక్షి: మండలంలోని కుర్లపల్లి గ్రామ సమీపంలో ఆదివారం ఎస్‌ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,300తో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

కల్యాణం .. కమనీయం



అలంకరణలో లక్ష్మీనారసింహస్వామి

చిలమత్తూరు: మండల కేంద్రంలో లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు కల్యాణాన్ని చూసి తరించారు. అనంతరం స్వామి వారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నోరూరించే హలీమ్



విక్రయానికి సిద్ధంగా ఉంచిన హలీమ్

- రంజాన్ మాసం సందర్భంగా అందుబాటులోకి వచ్చిన హలీమ్
- సంప్రదాయ వంటకానికి మంచి ఆదరణ

హిందూపురం: పవిత్రమైన రంజాన్ మాసానికి ఎన్నో ప్రత్యేకలు ఉన్నాయి. ఈ సందర్భంగా రోజా, ఇఫ్తార్, సహెరీ (ఉపవాసదీక్షలు)లతో పాటు పసందైన ఆత్మీయ విందులతో పండుగ శోభను మరింత పెంచుతాయి. రంజాన్ మాసం వచ్చిందంటే చాలు మనందరికీ వెంటనే గుర్తొచ్చే వంటకం హలీమ్. దేశంలోని ప్రముఖ నగరాల్లో రంజాన్ మాసంలో హలీమ్ చాలా ఏళ్లుగా అందుబాటులో ఉంటోంది. అయితే కొన్నేళ్లుగా హిందూపురంలోనూ హలీమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. మటన్, చికెన్ రెండు వెరైటీల్లో హలీమ్‌ను విక్రయిస్తున్నారు.

అన్ని పట్టణాల్లోనూ...

తొలుత జిల్లా కేంద్రాల్లోనే హలీమ్ దొరికేది. ప్రస్తుతం జిల్లాలోని హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో కూడా డిమాండ్ అనుగుణంగా తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. గతంలో కొందరు అప్పుడప్పుడూ హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లి మరీ హలీం రుచులు అస్వాదించే వారు. ఇప్పుడు పట్టణాల్లో కూడా అందుబాటులో రావడంతో ముస్లింలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు కూడా హలీమ్‌ను ఆస్వాదిస్తున్నారు. రంజాన్ మాసంలో వ్యాపారులు హలీమ్ తయారుచేసి రోజూ సాయంత్రం నుంచి రాత్రి దాకా విక్రయిస్తున్నారు. హిందూపురం పట్టణంలోని వివిధ రాంతాల్లో ప్రతి రోజూ సాయంత్రం హలీమ్ విక్రయాలు సాగుతున్నాయి. రుచికరమైన హలీం లభిస్తుండటంతో ప్రజలు కూడా అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.



హిందూపురంలోని ఓ హోటల్ వద్ద హలీం సప్లయ్ చేస్తున్న తయారీదారుదు

హలీమ్ తయారీ ఇలా..

హలీమ్‌లో మంచిరకం గోధుమ రవ్వ, కోడి లేకపోతే గొర్రె మాంసం ప్రధానమైన వస్తువులు. పప్పుదినుసులకు తోడు ఆరు నుంచి పదిరకాల డ్రైఫ్రూట్స్, నెయ్యి, మిరియాలు ఉద్దిబేడలు, జీర, నుగులు, గశాలు, సాజీర సువాసన కోసం రాతిపువ్వు, ఎండిన గులాబిపువ్వుల రేకులు కలిపి హలీమ్ తయారు చేస్తారు. తొలుత గోధుమరవ్వతో పాటు మాంసం, కొన్నిరకాల దినుసులను నాలుగు గంటల పాటు ఒకే మంటపై ఉడికిస్తారు. తర్వాత మరి కొన్నిరకాల మసాల దినుసులను బాగా రుబ్బి ఇందులో వేసి మరో గంట పాటు ఉడికిస్తారు. ఇలా ఆరు నుంచి ఏడు గంటల పాటు ఉడిగించిన హలీమ్‌ను సాయంత్రం ఇఫ్తార్ సమయానికి సిద్ధంగా ఉంచుతారు. సాయంత్రం 4 గంటల నుంచి విక్రయాలు ప్రారంభం అవుతాయి. రంజాన్ మాసంలో ఉపవాసాలు చేసే వారు నీరసపడకుండా ఎక్కువ మంది హలీమ్‌ను ఆహారంగా తీసుకుంటారు.



హలీమ్‌ను ఆస్వాదిస్తున్న యువకులు

ఆదరణ బాగుంది



హిందూపురంలో సాయంత్రం సమయాల్లో విక్రయించే హలీమ్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. చాలా మంది పసందుగా ఆరగిస్తున్నారు. ముస్లింలే కాకుండా అన్ని వర్గాల వారు హలీమ్‌ను ఇష్టంగా తింటున్నారు. హలీమ్ కేవలం రుచిగానే కాకుండా బలవర్ధక ఆహారంగా ఉంటుంది. శరీరానికి అవసరమైన పోషకాలన్నీ ఇందులో ఉంటాయి.

– అర్బర్, ఆలాం, వంట మాస్టర్లు, హిందూపురం

బలవర్ధకమైన ఆహారం 'హలీమ్'



పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువ మంది ఉపవాసదీక్షలు చేస్తుంటారు. సాయంత్రం పూట దీక్ష ముగించిన తర్వాత బలమైన ఆహారం తీసుకుంటుంటారు. ఇందులో హలీమ్ ఎంతో ముఖ్యమైంది. మాంసకృత్తులు, పిండిపదార్థాలు, పప్పుదినుసులు ఇలా అన్నీ కలిసిన ఆహారం కావడం వల్ల శరీరానికి అన్ని పోషక పదార్థాలు చక్కగా అందుతాయి. హిందూపురంలోనూ హలీమ్ లభిస్తుండటం హర్షణీయం.

– రేష్మా, హిందూపురం

చాలా ఇష్టంగా తింటారు



రంజాన్ మాసంలో దొరికే హలీమ్‌ను మా ఇంట్లో చిన్నా, పెద్దా అందరూ ఎంతో ఇష్టంగా తింటారు. చికెన్, మటన్ రెండు వెరైటీల్లోనూ లభిస్తుండటం కలిసొచ్చే అంశం. ఉపవాస వేళ హలీమ్ తినడం ద్వారా శరీరానికి మంచి శక్తి లభిస్తుంది. గతంలో కేవలం హైదరాబాద్ లాంటి నగరాల్లో మాత్రమే హలీమ్ దొరికేది. అప్పుడప్పుడూ అక్కడికి వెళ్లి తినేవాళ్లం. అయితే రెండేళ్లగా హిందూపురంలోనే హలీమ్ దొరుకుతుండటంతో ఇంటిల్లిపాది ఇష్టంగా తింటున్నారు.

– షభానా, హిందూపురం

నేడు మడకశిరలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

మడకశిర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మడకశిర పట్టణంలో సోమవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పావగడ రోడ్డులోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 3వ వార్డు పరిధిలోని శివాపురంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ప్రచారంలో పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌కు గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి సర్పంచ్ రంగనాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం ఆయన రేకులకుంటకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం రంగనాథ్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో సర్పంచ్ రంగనాథ్‌కు స్వల్పంగా గాయపడగా మడకశిర ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, మూర్తి, తిమ్మప్ప, మంజునాథ్, నాగేంద్రయాదవ్, నాగభూషణరెడ్డి, నరేష్‌రెడ్డి చికిత్స పొందుతున్న రంగనాథ్‌ను పరామర్శించారు.

చందకచర్లలో టీడీపీకి షాక్



వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

మడకశిర: మండలంలోని చందకచర్లలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఆదివారం రాత్రి టీడీపీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. శివానాయక్, భూతనాయక్, మురళీనాయక్, శ్రీరామ్‌నాయక్,రవినాయక్, బాబునాయక్, ధనుంజయ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- 'పురం' రూపురేఖలు మారుస్తామన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

హిందూపురం: 'నియోజకవర్గంలో 40 ఏళ్లుగా టీడీపీ వారే ఎమ్మెల్యేలుగా గెలుస్తూ వచ్చినా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించి వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టండి. నియోజకవర్గ రూపురేఖలు మారుస్తాం' అని హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్.దీపిక అన్నారు. ఆదివారం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో కురుబ వెంకటేష్ ఆహ్వానం మేరకు తరలివెళ్లి ముద్దిరెడ్డిపల్లిలో పలువురితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కురుబ దీపిక మాట్లాడుతూ సినిమా గ్లామర్‌ను అడ్డుపెట్టుకొని టీడీపీ గెలుస్తోందని, ఎమ్మెల్యే బాలకృష్ణ స్థానికంగా లేకుండా చుట్టుపు చూపుగా వచ్చిపోతున్నారని విమర్శించారు. ఇంకా ఏనాళ్లు ఎమ్మెల్యే కోసం ఎదురుచూడాలో ప్రజలే చెప్పాలన్నారు. స్థానకంగా ఉంటూ మీ ప్రతిక ష్టంలో తోడుంటానని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శాంతమ్మను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ మనోహర్, పామిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ముద్దిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక

జగన్‌తోనే వాల్మీకులకు న్యాయం

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలోనే వాల్మీకులకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. ఆయన శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో పట్టణ వాల్మీకి సంఘం అధ్యక్షుడు మోహన్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వాల్మీకులందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చేలా చూడాలని మోహన్‌కుమార్‌ని కోరారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ వాల్మీకుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. రాజకీయంగా కూడా వాల్మీకులకు ముఖ్యమంత్రి జగన్ పెద్దపీట వేశారన్నారు. హిందూపురం ఎంపీ సీటును వాల్మీకి వర్గానికి చెందిన శాంతమ్మకు కేటాయించారని, జెడ్పీ చైర్‌పర్సన్‌గా బోయ గిరిజమ్మను నియమించి వాల్మీకులకు రాజకీయంగా అండగా నిలబడ్డారన్నారు. అనంతరం బోయ సంఘం నాయకుడు, కౌన్సిలర్ లక్ష్మయ్యను కూడా ఆయన కలిసి మద్దతు కోరారు.



వాల్మీకి సంఘం అధ్యక్షుడు మోహన్‌కుమార్‌తో సమావేశమైన ఈరలక్కప్ప

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం

హిందూపురం టౌన్: జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్థానిక జీవీఎస్ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. అనతి కాలంలోనే క్రీడాకారులు జాతీయ పోటీల్లోనూ రాణించడం హర్షణీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ, కోశాధికారి శేఖర్, కార్యదర్శి మహమ్మద్ సలీమ్, ఈసీ మెంబర్లు విజయవాణి, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసరెడ్డి, ఆజాద్, ఆర్‌డీటీ ఫుట్‌బాల్ కోచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌బాల్ క్రీడాకారులను సత్కరిస్తున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి



పరిగి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఉషశ్రీచరణ్, శాంతమ్మ సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ వర్గీయులు

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తిలో టీడీపీకి చెందిన 10 కుటుంబాలు ఆదివారం మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, నాయకులు సదాశివరెడ్డి, బాలాజీ, రవీంద్ర రెడ్డి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సాధ్యమని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ అన్నారు. ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మతో కలిసి బీచిగానిపల్లి పంచాయతీలో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఇలా ఎన్ని పార్టీలు ఏకమై గుంపుగా వచ్చినా జగనన్న సింగిల్‌గానే వస్తారన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఫ్యాన్‌గుర్తుకు ఓటేసి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, ఎంపీపీ సవిత , జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, నాయకులు ప్రభాకర్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

వైఎస్సార్‌సీపీలో చేరిక

మండలంలోని బీచిగానిపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ నాగరాజుతో పాటూ పలు ఎస్సీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అలాగే స్థానిక నాయకుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు, పాత్రగానిపల్లి, వంగలపల్లిలో 22 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

దీక్షాపరులకు ఇఫ్తార్ విందు

హిందూపురం: రంజాన్ ఉపవాసదీక్షలు చేసే ముస్లింలకు 5వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్, క్వాలిటీ నసీర్ పట్టణంలోని ఆబాద్‌పేట, ధరంపురం ప్రాంతాల్లో ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే అందరికీ 'ఆష్' అనే వంట పదార్థాన్ని అందరికీ పంపిణీ చేశారు.

గుడ్డం రంగనాథుడి గిరి ప్రదర్శన



పూలరథంపై కొలువుదీరిన రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి గిరి ప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంపై కొలువుదీర్చి పూజలు చేసి గిరి ప్రదర్శన నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక తాతయ్య దర్గా

- నేడు గంధం ఉత్సవం

పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పరిగి మండల పరిధిలోని శ్రీరంగరాజుపల్లి జయమంగళి నది తీరాన ఉన్న తాతయ్య దర్గాలో సోమవారం గంధం ఉత్సవం జరగనుంది. ప్రతి యేటా హోలీని పురస్కరించుకుని ఇక్కడ మూడు రోజుల పాటు ఉరుసు మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారుల ఆదేశాల మేరకు గంధం ఊరేగింపు మాత్రమే నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

దర్గా ఉరుసు (తాతయ్య పరుష) ఉత్సవాలు గ్రామస్తులు, దర్గా వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. సోమవారం రాత్రి 10 గంటలకు గంధోత్సవం జరుగుతుంది. నృత్యాలతో, వీరగాసేల విన్యాసాలతో విద్యుత్ దీపాలంకరణ చేసిన వెండి రథంపై గంధాన్ని ఊరేగిస్తారు. మంగళవారం ఉదయం నుంచే రోజంతా అన్నదానం నిర్వహిస్తారు.



శ్రీరంగరాజుపల్లిలో తాతయ్య స్వామి సమాధి

మందలపల్లిలో ఆత్మీయ సమావేశం

గుడిబండ: మండల పరిధిలోని మందలపల్లి ఎస్సీ కాలనీలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజరేగౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన సంక్షేమాభివృద్ధిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని యంజరేగౌడ్ తెలిపారు. సమన్వయంతో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. యువరాజు, కదురప్ప, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

మడకశిరరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు కోరారు. ఆదివారం జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, ఎంపీపీ కవిత, సింగల్‌విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మండల పీఎంపీ కన్వీనర్ మూర్తి, తాలుకా బీసీ సెల్ నాయకులు తిమ్మప్ప, సత్యనారాయణరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్ తదితరులు పంచాయతీల్లో పర్యటించారు. మేము సిద్ధం-మా బూత్ సిద్ధం సామగ్రిని బూత్ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఘనంగా మట్టల ఆదివారం



మడకశిర: వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన క్రైస్తవులు

హిందూపురం/పెనుకొండ/మడకశిరరూరల్: ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని చర్చీల్లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత మట్టలను చేత పట్టుకొని ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక పాటలు పాడారు. పాస్టర్లు మట్టల ఆదివారం ప్రత్యేకతను తెలియజేశారు. హిందూపురంలోని సీఅండ్‌జీ మిషన్ కాంపౌండ్‌లో పాస్టర్ రెవరెండ్ స్టీఫెన్ రాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. మడకశిరలో పాస్టర్ షాలిమ్‌దాస్, కమిటీ ఆధ్వర్యంలో సీఐఅండ్‌జీఎం చర్చి నుంచి క్రైస్తవులు ర్యాలీ చేసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెనుకొండలోని అన్ని చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.



హిందూపురం: అంబేద్కర్ కూడలి వద్ద మట్టలు చేతబట్టి ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



పెనుకొండ: చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు